# స్పర్ధ

పొడుగు వెంకటేశ్వరరావు



**క్లబ్బు వార్షికోత్సవానికి పిలవటానికి వచ్చారు నలుగురు నారీమణులు, పట్టుచీరల్ని రెపరెపలాడించుకుంటూ, వాణీబాయి గారింటికి, వాళ్ళని కూర్చోబెట్టి కూల్డ్రింకులూ అవీ ఇచ్చి మర్యాదలు చేసింది వాణీబాయి చెలికత్తె చిన్నమ్మ. ఆ తర్వాత కాసేపటికి మేడమీద నుండి క్రిందికి దిగి వచ్చింది వాణీబాయి. కుశల ప్రశ్నలు అయ్యాక క్లబ్బు వార్షికోత్సవం సంగతి చెప్పి చీఫ్ గెస్టుగా రావాల్సిందిగా వాణీబాయిని కోరారు వాళ్ళు. వాణీబాయి అందుకు సంతోషంగా అంగీకరించింది. వాళ్ళు ఎన్నో విధాలుగా కృతజ్ఞతలు తెలిపి, ఆ తర్వాత చందా సంగతి ప్రస్తావించారు. ఆ మాట వినగానే వాణీబాయి మొహంలో రంగులు మారటం గమనించిన ఒకామె ''రాణీబాయి గారు అయిదువేలు ఇచ్చారు. కార్యక్రమం అనగానే ఖర్చులుంటాయి గదా మేడం. అదే విధంగా మీరున్నూ, ఉదారంగా విరాళం ఇస్తే ఫంక్షన్ గ్రాండుగా జరుగుతుంది'' అంది. ఆ మాట మంత్రంలా పనిచేసింది. వాణీబాయి వెంటనే చెక్కుబుక్కు తీసి పదివేలకి చెక్కురాసి వారికిచ్చింది. వాళ్ళు ఎంతో సంతోషించి, వాణీబాయిని వేనోళ్ళ పొగిడి, కృతజ్ఞతలు చెప్పి సెలవు తీసుకుని వెళ్ళారు. వాణీబాయి మొహం గర్వంతో ఒక వెలుగు వెలిగింది.**

వాణీబాయి ఇల్లూ, రాణీబాయి ఇల్లూ సిటీలో 'పోష్‌లొకాలిటీ' లో ఎదురెదురుగా వుంటాయి. అందమయిన గార్డెన్స్ మధ్య ఆధునాతనంగా నిర్మితమయిన ఆ రెండు మేడలూ, చూపరులను ఆకర్షించటంలో ఒకదానితో ఒకటి పోటీపడ్తూ వుంటాయి.

వాణీబాయి భర్త వినయబాబూ, రాణీబాయి భర్త రాజబాబూ పేరు మోసిన వ్యాపారులు, కోట్లకి పడగలెత్తిన వాళ్ళు. సంఘంలో మంచి గుర్తింపు వున్నవాళ్లు.

***

''పండగ వస్తోంది గదా 'గిఫ్టు' ఇద్దామనుకుంటున్నాను. ఏం కావాలి?'' అని అడిగాడు శ్రీమతిని రాజబాబు. రాణీబాయి చిరునవ్వు నవ్వింది. అతనికి ఆ నవ్వే వరహాల పెట్టు.

ఇద్దరూ భోజనం చేస్తున్నారు. తను వడ్డించుకుంటూ, అతనికి కూడా కొసరి కొసరి వడ్డించింది ఆమె.

''కూర చాలా బావుంది'' అన్నాడు.

''ఇంకొంచెం వేసుకోండి'' అంది.

''చాలు కడుపులో పట్టద్దూ? వద్దూ?'' అని వారించాడు. కబుర్లు చెప్పుకుంటూ ఇద్దరూ కలిసి భోజనం చెయ్యటం అతనికి ఇష్టం. ఎన్ని పనులున్నా వీలుకల్పించుకుని అతను భోజనానికి ఇంటికి రావటం ఆమెకి ఇష్టం.

***

ఎప్పుడూ బిజీగా వుండే వినయబాబుకి ఆ రోజు కాస్త వీలు చిక్కింది. వెంటనే ఇంటికి ఫోన్ చేశాడు. వాణీబాయి ఫోను ఎత్తింది.

''హలో ఏం చేస్తున్నావు?'' ఆపేక్షగా అడిగాడు వినయబాబు.

''నా మొహం చేస్తున్నాను'' అంది చిరాగ్గా. అతను ఉలిక్కిపడ్డాడు.

''అదేమిటి? మూడ్ బాగాలేదా?'' అన్నాడు.

''మూడ్ బాగా ఎట్లా వుంటుంది? ఇవాళ పేకాటలో పాతికవేలు పోయాయి'' అంది.

''పోతే పోయాయి అలా అని మూడ్ పాడుచేసుకుంటారా?''

''నేను అంతే నా మూడ్ పాడయ్యింది. సరే గాని, ఎందుకు ఫోను చేశారు?''

''భోజనానికి ఈ రోజు ఇంటికి రావాలన్పించింది. మనిద్దరం కలిసి ఇంట్లో భోజనం చేసి ఎన్నాళ్ళో అయ్యింది గదా! అదీ సంగతి'' స్నేహంగా నవ్వాడు.

''ఇవాళ కుదర్దు'' అంది నిర్మొహమాటంగా.

''ఏం ఎందుకుదర్దు?'' అతని గొంతులో ఆశాభంగం.

''నేను మిసెస్ రెడ్డిగారింటికి డిన్నర్‌కి వెళ్తున్నా''అని ప్రకటించింది.

''నీతో నేను కూడా రానా?'' అడిగాడు అర్థింపుగా.

''నలుగురూ నవ్వుతారు. అది లేడీస్ పార్టీ'' అని ఫోన్ పెట్టేసింది.

వినయబాబుకి బాగా నిరాశ కలిగింది. కారుని క్లబ్బుకి పోనిమ్మని చెప్పాడు డ్రయివరుతో.

***

సోఫాలో ఠీవిగా కూర్చుని వుంది వాణీబాయి. ఆ ప్రక్కనే చేతులు కట్టుకున్నిలబడి వుంది చిన్నమ్మ.


''చిన్నా ఏంటి విశేషాలు?'' అడిగింది.

''మీరే చెప్పాలి మేడం'' వినయంగా అంది చిన్న.

''పండగ దగ్గరకి వస్తోంది గదా ఇక అంతా హడావుడే. అన్నట్లు ఎదురింటివారి విశేషాలేమిటి?''

''సెల్‌లో సీతమ్మని కనుక్కున్నాను. కొన్ని విషయాలు తెలిశాయి'' అంది.





''సీతమ్మెవరు?''

''అదేనండీ ఎదురింటి వారి వంటమనిషి. ఆవిడ ద్వారా మనకి ఆ ఇంటి సంగతులన్నీ తెలుస్తా యన్నమాట''

''అవును గదూ. ఏంటీ సీతమ్మ కబుర్లూ?'' నవ్వింది వాణీబాయి విలాసంగా.

''ఆ ఇంట్లో బాగా హడావుడిగా వుందండి. పండక్కి పిల్లలు వస్తున్నారుట. రోజూ షాపింగులే. ఆ బాబు ఆవిడకి ఖరీదైన డైమండు నెక్లసు కొన్నా రట. లక్షరూపాయిలయిందట. అదిగాక పాతిక వేలు పెట్టి పట్టు చీరా, డ్రస్సులూ కొన్నారట. పిల్ల లకీ, ఆయనకీ లేటెస్టు ఫేషన్‌వి బట్టలు తీశారట. ఇవి ఇంట్లో వాళ్ళకి. ఇవిగాక ఎందుకోగాని మరొక ఇరవయిమందికి బట్టలు తీశారట''

''ఏం జేసుకుంటారో?''

''అదే అర్థంకావటం లేదమ్మా. వాళ్ళపనులన్నీ చిత్రంగా వుంటాయంటుంది సీతమ్మ''

''సర్లే సర్లే'' అంది వాణిబాయి. ఆమెలో ఆవేశం పొంగి పొర్లుతూ వుంది. వాళ్ళు కొనగాలేనిది తను కొనలేదా? వెంటనే ఫోను తీసి డయల్ చేసింది. వినయబాబు ఫోన్ అందుకున్నాడు.

''చెప్పు వాణీ'' అన్నాడు.

''పండగ దగ్గరకి వస్తోంది. చాలా పర్చేజెస్ వున్నాయి. నా ఎకౌంటులో లక్షన్నాలేదు. వెంటనే ఐదు లక్షలు నాకు నా ఎకౌంటుకి ట్రాన్స్ఫర్ చేయిం చండి అర్జెంటు'' అంది.

''అలాగే వెంటనే ఏర్పాటు చేస్తాను'' అన్నాడు.

''బాబు దగ్గర నుంచీ, పాప దగ్గర నుంచీ ఫోన్లు వచ్చాయా?''

''ఆ నేనే చేసి మాట్లాడాను''

''వాళ్ళు ఎప్పుడు వస్తున్నారు? పెద్ద పండగ కదా. ముందుగా రమ్మన్నారా''

''బాబు ఫ్రెండ్సుతో గోవా వెళ్తున్నాడట. రానన్నాడు. పాప వాళ్ళాయన్తో అత్తగారింటికి వెళ్తుందట. అందుకని ఇద్దరూ రావటం లేదు ఈ పండగకి'' అన్నాడు.

''వాళ్ళని గట్టిగా రమ్మని మీరు చెప్ప లేదా?''

''చెప్పాను''

''మరెందుకు రావటం లేదు? పోయిన సారి పండగకి కూడా ఇద్దరూ రాలేదు గదా?''

''తెలియదు'' అన్నాడు పొడిగా. ఆమెకు ఎంతో ఆశాభంగం అయ్యింది. కోపం వచ్చింది.

''కారణం తెలుసుకోవాల్సిన బాధ్యత మీకు లేదా? పిల్లలందరూ వచ్చి ఇల్లు కళకళలాడగా, పండగని మనింట్లో ఘనంగా జరుపుకోవాలని వుండొద్దా?'' నిలదీసినట్లు అడిగింది భర్తని.

''మేడమ్! ఆ కోరిక నాకూ వుంది. కాని నేను నిస్సహాయుడిని. పోనీ నువ్వు ఫోను చేసి చెప్పరాదూ. అలాగైనా వస్తా రేమో?''

''నేనా? నేను చెప్పను. ఏం? వాళ్ళ కేనా అంత పట్టుదల? నాకు వుండదా? అసలేమిటీ మీ ఉద్దేశం?'' నిల దీసిందతన్ని. అతను మౌనంగా వుండిపో యాడు. విసురుగా ఫోను పెట్టేసింది వాణీబాయి.

***

ఆ సాయంత్రం చిన్నమ్మని వెంట బెట్టుకుని షాపింగ్‌కి వెళ్ళింది వాణీబాయి. నగల షాపులో ఆమెకి ఒక డైమండు నెక్లెసు నచ్చింది. ''ఎంత'' అని అడిగింది. ''తొంబయివేల''ని అన్నాడు షాపువాడు. పెదవి విరిచింది. అంతకంటే ఖరీద యింది చూపమంది. అతను లోపలికి వెళ్ళి కొన్ని బాక్సులు తెచ్చాడు. చూపించాడు. అవి ఎంతని అడిగితే వాటి రేంజి ''లక్షా పాతికవేల'' ని అన్నాడు అతను.

''వీటికంటే ఇందాక మనం చూసిందే బావుంది మేడం'' అంది చిన్నమ్మ. ఆమె మాటని కొట్టిపారేసి, చివరకి లక్షపాతిక వేలకి నెక్లెసు తీసుకుంది వాణీబాయి. బాగుండటం బాగులేకపోవటం వేరే సంగతి. తన నెక్లెసు ధర రాణీబాయి తీసుకున్న దాని ధరకంటే ఎక్కువ వుండాలి అది రూలు. ఆ తర్వాత చీరలషాపుకి వెళ్ళారు. కొన్ని గంటలపాటు కొన్ని వందల చీరలు తిరగేసి, చివరకి ఒకటి సెలక్టు చేసి ధర ''ఎంత?'' అని అడిగింది. ఓపిగ్గా ఆ చీర గొప్ప దనాన్ని వల్లెవేసి, ''ఇరవయివేలు మేడం మీకు చాలా బాగుంటుంది'' అన్నాడు షాపుబాబు. ఆ చీరని పక్కకి గిరాటేసి ఇంకా మంచి చీరలు

చూపించమంది వాణీబాయి. ''ఓహో అలాగా'' అనుకుని అతడు పక్క సెక్షన్ నుంచి కొన్ని చీరలు తెచ్చి చూపించాడు. అందులో ఒకటి చూపించి ''ఎంతా?'' అని అడిగింది. ''ముప్పయివేలు'' అన్నాడు. ''మీకు గ్రాండుగా వుంటుంది'' అన్నాడు.

''ఈ కలర్ గాడీగా వుంది మేడం. బరువూ ఎక్కువగా వుంది. మీరు మోయలేరేమో'' అంది చిన్నమ్మ.

''చిన్నా అవన్నీ అనవసరం. చీర ఖరీదు పాతిక వేల కంటే ఎక్కువ అన్నది ముఖ్యం'' అని ఆ చీర పాక్ చేయించింది వాణీబాయి. షాపింగు ముగించుకుని ఇల్లు చేరేసరికి ప్రొద్దుపోయింది.

***

ఏం తోచక, తీరిగ్గా బీరువా తెరిచింది వాణీబాయి. అరల నిండా ఎన్నో చీరలు. ఒకసారి కట్టుకుని డ్రైక్లీనింగు చేయించి అన్నీ అందులో పడేస్తుంది. మళ్ళీవాటి మొహం కూడా చూడదు. అవి చాలవన్నట్లు ప్రతి పండక్కీ చీర కొనాల్సిందే. డ్రాయర్లులో నగల పెట్టెలు. కొన్ని కిలోల బరువయిన ఆ నగల్ని మోజుపడి కొనటమేగాని వాడటం చాలా తక్కువ. అవి చాలవన్నట్లు కావాలని అన్పించినప్పుడల్లా కొంటూనే వుంటుంది. ఎందుకూ అన్న ప్రశ్న రాకూడదు. చీరల్నీ, నగల్నీ వీలుపడినప్పుడల్లా కొని దాచుకోవటం, ఒక కలిగిన ఇంటి ఇల్లాలిగా తన హక్కు. అవసరం అనవసరం అన్న మీమాంసకి తావులేదు. కన్నులారా అన్నిట్నీ అలా చాలాసేపు తనివితీరా చూసుకుని తృప్తిపడి, ఆనందించి, కొత్తగా కొని తెచ్చినవాటిని పాతవాటతో పాటు సర్ది, బీరువాకి తాళం వేసి క్రిదికి దిగివచ్చింది వాణీబాయి 'కాఫీ' అంటూ.

సోఫాలో కూర్చుని మంచి కాఫీ తాగుతూ ''ఏంటి చిన్నా సీతమ్మతో సెల్‌లోమాట్లాడావా?'' అంది ''మాట్లాడానండి'' అంది చిన్నమ్మ.

''ఆమెకి మనం నిన్న కొన్న డయిమండ్ నెక్లెస్ సంగతీ, పట్టుచీర గురించీ చెప్పావా?''

''వివరంగా చెప్పానండి. ఈ పాటికి సంగతులన్నీ సీతమ్మ తన యజమానురాలికి చేరవేసి వుంటుంది''

''గుడ్! అది విని, ఆవిడ దెబ్బకి కుదేలయిపోవాలే! కడుపుబ్బి యమయాతన పడివుండాలే!''

''ఆ సంగతి తెలీదుగానీ, ఆవిడ చెప్పింది విని నేను దిగాలుపడిపోయానండీ''

''అదేం? ఏం చెప్పిందేమిటి ఆ సీతమ్మ మహా తల్లి?''

''ఆ బాబుగారు ఆమెకి ఈ పండగ సందర్భంగా లక్షరూపాయలు పెట్టి నెక్లెసూ, పాతికవేలు పెట్టి పట్టుచీరా కొంటానన్నమాట నిజమేనంటగానీ, కొనటం జరగలేదంట!''

''కొనలేదా? ఏం, ఏమయ్యిందటా?''

''పాపం ఆయన ఎంత బలవంతం చేసినా, రాణీబాయిగారు ఒప్పుకోలేదట. ఇప్పటికే నాకు బోలెడు చీరలూ నగలూ వున్నాయి. అవి వద్దుగాని ఈ పండగ సందర్భంగా ఒక మంచి పని చేద్దామని అందట. సర్లే నీ ఇష్టప్రకారం అలాగే చేద్దాం అని రాజబాబుగారు ఒప్పుకున్నారట''

''ఏమిటా మంచి పని?'' రొక్కించి అడిగింది వాణీబాయి, వుక్రోషంగా.

''ఆ సంగతి తర్వాత చెపుతానని హడావుడిగా ఫోను ఆఫ్ చేసింది సీతమ్మ'' అంది చిన్నమ్మ. సడన్‌గా క్రుంగిపోయినట్లు అనిపించింది వాణీబాయికి.

***

ఆరు నూరయినా, నూరు ఆరయినా, మాట అంటే తను దానిమీదే నిలబడ్తుంది. ఇంతా హడావుడి చేసి, రాణీబాయి చివరికి తుస్సుమనిపించింది. అందుకే ఆవిడంటే తనకి అయిష్టం. వెదవ డబ్బు ఖర్చు పెట్టుకోవటానికి కాకపోతే, వుండి ఉపయోగం ఏమిటి? ఏం చేసుకుంటుంది?

ఎదురిల్లు సందడి సందడిగా వుంది. వూళ్ళనుంచి పండక్కని ముందుగానే దిగారు. పిల్లలు, కుర్రాడు ఎర్రగా బుర్రగా బాగానే వుంటాడు. మణిపాల్‌లో మెడిసిన్ చదువుతున్నాడట. 'పిల్లది' బంగారు తీగలా వుంటుంది. తను కార్పొరులో ఇంజనీరింగ్ చదువుతుందట. ఏ మాట కామాట అనుకుంటే, తను మాత్రం తన పిల్లలకి ఏం తక్కువ చేసిందీ? పాప బి.ఏ. చదివింది. బాగా కట్నం ఇచ్చి తను మంచి సంబంధం చేసింది. అల్లుడుకి పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో మంచి ఉద్యోగం. వాళ్ళు బెంగుళూరులో వుంటారు. బాబు దావణగెరెలో మెడిసిన్ చేస్తున్నాడు, ఫైనలియర్. పిల్లలు ఇద్దరూ బుద్ధిమంతులు. నిదానస్తులు. అంతా తండ్రిపోలిక. అల్లుడూ ఎంతో బుద్ధిమంతుడు. పాపని పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు. అంతా బాగానే వుంది. కానీ పిల్లలు తనంటే ఎందుకోగాని ముభావంగా వుంటారు. తనతో అనలేదుగాని, బాబు మాటల సందర్భంలో ఎవరో తెలిసిన వాళ్ళతో అన్నాడట, ఆ మాట తన దాకా వచ్చింది. ''ఎప్పుడూ హైదరాబాదు రావేంటిరా అంటే ఆ ఏముందీ అక్కడ? నాన్నగారు ఎప్పుడూ ఆఫీసులో వుంటారు. అమ్మ క్లబ్బులో వుంటుంది. బోరు!'' అన్నాడట. ''అమ్మో! నాన్నగారు గనక నిలబడ్డారుగానీ, నిన్ను తట్టుకుని నిలబడటం చాలా కష్టమే'' అంటూ చతుర్లాడుతుంది పాప. ఆ మాటల్లో కొంత వాస్తవం వుంది. తనకి మాట పెళుసు. కుండబ్రద్దలు కొట్టినట్లు అట్లా మాట్లాడ్తావేమే! అట్లా అయితే ఎట్లా? అంటుంది అమ్మ. దురుసుతనం మాటనిజమేగాని తను చెడ్డది కాదు. తనలో లోపాలు లేవని తను ఎప్పుడూ అనలేదు. అయితే అభిమానం, ఆప్యాయతలు తనకీ వున్నాయి. తన వాళ్ళనుండి వాటిని తనూ ఆశించటం దురాశ కాదు గదా!

***

''మేడం లేటెస్ట్ న్యూస్'' అంటూ గాలిలా వచ్చింది చిన్నమ్మ. ఏమిటనన్నట్లు చూసింది వాణీబాయి.

''ఎందురింటి రాణీబాయిగారి ఫ్యామిలీ అందరూ కలిసి, రెండు కార్లలో బయలుదేరి వెళ్ళారు. ఎందుకో తెలుసా? కొత్తగూడులో వృద్ధాశ్రమంలో వాళ్ళకీ, ఆ ప్రక్కనే వున్న అనాధాశ్రమంలో వాళ్ళకీ ఈ పండగ సందర్భంగా బట్టలూ, పండ్లూ పంచిపెడతారట'' అంది చిన్నమ్మ బుగ్గలు నొక్కుకుంటూ.

''మంచి పనేగా'' అంది వాణీబాయి. వూహించని ఆ రెస్పాన్సుకి బిత్తరపోయి, పక్కకు జారుకుంది చిన్నమ్మ. 'ఈవిడ ఎప్పుడెలా మాట్లాడ్తుందో ఇన్నాళ్ళయినా నాకు అర్థం కాదు గదా' అనుకుంటూ.

***

అట్లా-బుగ్గను చెయ్యి పెట్టుకుని ఆలోచిస్తూ వుంది. వాణిబాయి. తనకి అన్నీవున్నాయి. మంచి భర్తా, బుద్ధిమంతులయిన పిల్లలూ, ఆదరించే తల్లిదండ్రులూ, అభిమానించే బంధుమిత్రులూ, ఆస్తీ, అంతస్తూ అన్నీ వున్నాయి. కానీ, ఏదో లేదు. అవసరమన్పించేదేలేదు. ఏమిటో తెలీదు. అది తనకి మరి ఎందుకు లేదో అర్థం కాదు. అప్రయత్నంగానే ఆమె కళ్ళ నుండి అశ్రువులు పొంగులెత్తాయి.

ఫోను మోగింది. తీసింది. మద్రాసు నుంచి ఆమె తండ్రి మాధవరావు ఫోను చేశారు.

''అంతా బాగున్నారా నాన్నగారూ?'' అంది వాణీబాయి కళ్ళు తుడుచుకుంటూ.

''ఆ బాగానే వున్నాము. అమ్మాయిని చూడాలన్పిస్తోందని మీ అమ్మ గొడవ చేస్తూ వుంది. అందుకని నువ్వు వెంటనే బయలుదేరి రావాలి. నీకు తెలుసుగా. మీ అమ్మ సంగతి. పండక్కి వచ్చినట్లుకూడా వుంటుంది. నేను మీ ఆయనతో మాట్లాడాను. ఆయన సరేనన్నారు. మీ ఇద్దరికీ ఫ్లయిట్ టికెట్లు తీశాను. కంప్యూటర్‌లోంచి ఇ-టికెట్స్ డౌన్ లోడ్ చేసుకో. ఇవాళ సాయంత్రమే మీ ఫ్లయిట్ పోతే, నేను ఫోను చేసి పాపతోనూ, బాబుతోనూ ఇందాకే మాట్లాడాను. వాళ్ళేదో చెప్పబోయారు గాని నేను ఒప్పుకోలేదు. అందువలన, రేపుదయానికి ఫ్యామిలీతో మీ అమ్మాయి, రేపు సాయంత్రానికి దావణగెరె నుండి నీ కొడుకూ ఇక్కడ దిగుతారు. నువ్వూ మీ ఆయనా వాళ్ళకి స్వాగతం చెప్పుదురుగాని. దానికి ముందు, నన్నూ మీ అమ్మనీ, నీకూ మీ ఆయనకీ ఆహ్వానం పలికే అదృష్టం ప్రసాదించు చిట్టి తల్లీ!'' గలగలాతను చెప్పేది చెప్పేశారు ఆయన. వాణిబాయిలో ఉత్సాహం వుప్పెనలా పొంగింది.

''నాన్నగారూ!'' ఏదో అనబోయింది.

''ఏమయినా వుంటే మనం కలిశాక మాట్లాడుకుందాం. నువ్వు బట్టలూ అవీ సర్దుకుని ప్రయాణానికి రెడీ కావాలి గదా. ఇక వుండనా చిట్టితల్లీ'' అని ఫోను పెట్టేశారు ఆయన. ఆయన అంతే

వాణీబాయి వుక్కిరిబిక్కిరయ్యింది. ఆనందంతో వుబ్బి తబ్బిబ్బయ్యింది. తను పోగొట్టుకుంటున్నాననుకున్నదేదో అరచేతిలోకి అందినట్లనిపించింది.

*